క్లుప్తంగా

మౌలానా ఆజాద్ నేటి యువతకు స్ఫూర్తి



ఆజాద్ వాక్‌డే నిర్వహిస్తున్న మను పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్ : స్వాతంత్య్రం కోసం త్యాగం చేసిన గొప్ప నేత మౌలానా ఆజాద్‌ను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని మను పాలిటెక్నిక్ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ మీర్జా విలయత్ పేర్కొన్నారు. మౌలానా ఆజాద్ జయంతి ఉత్సవాల సందర్భంగా కడప నగర శివారులోని మను పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం ఆజాద్ డే వాక్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ మిర్జా విలాయడ్ ఆలీ బైగ్ మాట్లాడుతూ విద్యారంగం అభివృద్ధికి మౌలానా ఆజాద్ చేసిన కృషి అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో హకీమ్ ఉద్దీన్, మహమ్మద్ సికిందర్ హుస్సేన్, విద్యార్థులు పాల్గొన్నారు.

రసాయన శాస్త్రంలో డాక్టరేట్ ప్రదానం



నాగేంద్రప్రసాద్

వైవీయూ : దువ్వూరు మండలం గుడిపాడు గ్రామానికి చెందిన తాళ్లమాపురం నాగేంద్ర ప్రసాద్‌కు తిరుపతి వేంకటేశ్వర విశ్వవిద్యాలయం రసాయన శాస్త్రంలో డాక్టరేట్ ప్రదానం చేసింది. ఐఐసీటీ పూర్వపు సంచాలకులు డాక్టర్ శ్రీవారి చంద్రశేఖర్, కో సూపర్ వైజర్ ఆచార్య సి.సురేష్ రెడ్డి పర్యవేక్షణలో 'డెవలప్‌మెంట్ ఆఫ్ సింథటిక్ స్ట్రాటజీస్ టువర్డ్స్ స్పైరోసైక్లిన్/ఫ్యూజ్డ్ అజా–హెటిరోసైకిల్స్ అండ్ లూపియాల్ డిరివేటివ్స్' అంశంపై ఆయన చేసిన పరిశోధనకు ఈ డాక్టరేట్ ప్రదానం చేసినట్లు ఎస్వీయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎం. దామ్లా నాయక్ తెలిపారు.

బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు విద్యార్థిని ఎంపిక



ఎంపికైన భార్గవిని అభినందిస్తున్న ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్, పీడీలు

కడప ఎడ్యుకేషన్ : కడప నగర శివారులోని కేఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో తృతీయ సంవత్సరం ఈసీఈ చదువుతున్న రేనాటి భార్గవి రాష్ట్ర స్థాయి సీనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ వీఎస్ఎస్.మూర్తి తెలిపారు. ఈ నెల 8,9, 10వ తేదీలలో కర్నూలు జిల్లా నంద్యాలలో జరిగే రాష్ట్ర స్థాయి సీనియర్ మెన్ అండ్ ఉమెన్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలలో ఆమె పాల్గొంటుందని తెలిపారు. ఎంపికైన విద్యార్థినిని ప్రిన్సిపల్‌తో పాటు వైస్ ప్రిన్సిపల్ ప్రసాద్, పీడీలు నారాయణ, వంశీనాయక్ అభినందించారు.

ప్లకార్డులతో విద్యార్థుల ర్యాలీ



క్యాన్సర్‌పై ప్లకార్డులతో అవగాహన కల్పిస్తున్న వైవీయూ అధికారులు, విద్యార్థులు

వైవీయూ : మంచి అలవాట్లతో క్యాన్సర్‌కు దూరం కావచ్చని వైవీయూ రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ పేర్కొన్నారు. వైవీయూ పరిపాలనా భవనం వద్ద క్యాన్సర్ వ్యాధిపై నిర్వహించిన అవగాహన ర్యాలీని పరిపాలనా భవనం వద్ద రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ, ప్రధాన ఆచార్యులు ప్రొఫెసర్ ఎస్.రఘునాథరెడ్డి గురువారం ప్రారంభించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ సేవా పథకం ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ కె.లలిత, డా.సునీత, మైనార్టీ సెల్ కన్వీనర్ డాక్టర్ రియాజున్నీసా ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువత గ్రామీణ ప్రాంతాలలో క్యాన్సర్ గురించి అవగాహన పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ వెంకటరామిరెడ్డి, ఆచార్య ఏజీ దాము, డాక్టర్ సి. సరిత, డాక్టర్ సుబ్రహ్మణ్యంశర్మ, డా.సుభాష్ చంద్ర, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విధులకు సచివాలయ సిబ్బంది డుమ్మా!

సిద్దవటం : మండలంలోని మాధవరం-1 గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామ సచివాలయం -2లో గురువారం కొందరు ఉద్యోగులు గైర్హాజరయ్యారు. గైర్హాజరైన ఉద్యోగులపై గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ఉద్యోగులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. గ్రామ ప్రజలు వారి సమస్యలను విన్నవించుకోవడానికి సచివాలయానికి వచ్చి ఉద్యోగులు లేకపోవడంతో వెనుతిరుగుతున్నారు. విధులకు ఉద్యోగులు వీఆర్ఓ, వ్యవసాయ అసిస్టెంట్, ఏఎన్ఎం, వెల్ఫేర్ అసిస్టెంట్లు మాత్రమే హాజరుకాగా, మిగిలిన ఐదుగురు ఉద్యోగులు గైర్హాజరయ్యారు. ఈ విషయమై ఎంపీడీఓ ఫణీరాజకుమారిని వివరణ కోరగా విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే ఉద్యోగులపై తగు చర్యలు తీసుకుంటామని ఆమె అన్నారు.

ర్యాగింగ్ వికృత క్రీడకు చరమగీతం

ఎన్నో ఆశలు.. మరెన్నో ఆకాంక్షలతో కళాశాలల్లో అడుగుపెట్టిన విద్యార్థులకు సీనియర్ల రూపంలో ర్యాగింగ్ ఎదురైతే... అప్పుడప్పుడే అడుగుపెట్టిన విద్యార్థులు అభద్రతాభావానికి లోనవుతారు. చదువుపై శ్రద్ధ వహించలేక మానసిక సంఘర్షణకు లోనై ఇతర అఘాయిత్యాల వైపు ఆలోచిస్తారు. ర్యాగింగ్‌కు పాల్పడిన వారి జీవితాలు జైలు పాలవుతాయి. ఈ విశృంఖల రాక్షస క్రీడకు చరమగీతం పాడి విద్యార్థులు జైలు పాలు కాకుండా కాపాడేందుకు వైవీయూ శ్రీకారం చుట్టింది. ర్యాగింగ్ రహిత విద్యాలయంగా తీర్చిదిద్దేందుకు ప్రచారం చేపట్టింది.

- ర్యాగింగ్ రహిత విద్యాలయంగా వైవీయూ
- విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు
- చట్టం ప్రకారం శిక్ష, జరిమానా తప్పదంటున్న పోలీసులు



యాంటీ ర్యాగింగ్ పోస్టర్లను విడుదల చేస్తున్న వైవీయూ అధికారులు (ఫైల్)



వైవీయూలోని భోజనశాల వద్ద ఏర్పాటు చేసిన పోస్టర్లు

వైవీయూ : విద్యాలయంలోకి అడుగుపెట్టే విద్యార్థులకు ఎదురయ్యే తొలి సమస్య ర్యాగింగ్.. సీనియర్ విద్యార్థులు సరదాగా జూనియర్లను ఆటపట్టించడంతో మొదలై తీవ్ర చర్యలకు పాల్పడే విష సంస్కృతికి చరమగీతం పాడేందుకు యోగి వేమన విశ్వవిద్యాలయం శ్రీకారం చుట్టింది. వైస్ చాన్సలర్ ఆచార్య కె. కృష్ణారెడ్డి మార్గదర్శనంలో వైవీయూను ర్యాగింగ్ రహిత విద్యాలయంగా ప్రకటించడంతోపాటు, అలాంటి వాటికి అవకాశం లేకుండా చేసి విద్యార్థుల్లో మనో ధైర్యం నింపేలా చైతన్య కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగా అన్ని డిపార్ట్‌మెంట్లు, భోజనశాల, హాస్టల్స్‌లో పోస్టర్లు అతికించారు. ఇందులో ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్, స్థానిక పోలీసు అధికారుల ఫోన్ నెంబర్లు ప్రచురించారు. ర్యాగింగ్‌కు పాల్పడితే వర్తించే చట్టాలు, శిక్షల గురించి అవగాహన కల్పించేలా వాటిని రూపొందించారు. వైవీయూలో ర్యాగింగ్ ఆనవాళ్లు లేకపోయినప్పటికీ మెడికల్, ఇంజినీరింగ్ కళాశాలల్లో అక్కడక్కడా ఈ ఘటనలు ఎదురవుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఒకవేళ ఎవరైనా తుంటరి విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడితే తీసుకోవాల్సిన జాగ్రత్తలకు సంబంధించి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు.

విద్యార్థులు చేయాల్సిందిలా..

- కళాశాలల్లో ప్రవేశించిన విద్యార్థులు ర్యాగింగ్ నిరోధక కమిటీ ప్రతినిధులు, ప్రిన్సిపల్, అధ్యాపకులు, హాస్టల్ వార్డెన్ల ఫోన్ నెంబర్లు దగ్గర ఉంచుకోవాలి.
- ర్యాగింగ్ వాతావరణం కనిపించినా.. భయపెట్టినా.. వెంటనే అధ్యాపకులకు ఫిర్యాదు చేయాలి.
- కళాశాల విషయాలు ఎప్పటికప్పుడు తల్లిదండ్రులతో చెబుతుండాలి. అవసరమైతే సూచనలు తీసుకోవాలి.
- ప్రథమ సంవత్సరం విద్యార్థులు గ్రూపుగా కలిసి వెళ్లడంతో ర్యాగింగ్ బారినపడే అవకాశం తక్కువ.
- చట్టపరంగా నిషేధించిన ర్యాగింగ్‌ను ధైర్యంగా ఎదుర్కోవాలే తప్ప పారిపోవడం.. పిరికితనంతో ఆత్మన్యూనతకు లోనుకావడం చేయరాదు.

కళాశాల యజమానులు చేయాల్సినవి ఇవే..

- తరగతులు ప్రారంభమైన వెంటనే పోలీసు అధికారులతో ర్యాగింగ్‌పై అవగాహన కల్పించాలి.
- కళాశాల క్యాంపస్, తరగతి గదులు, క్యాంటీన్, హాస్టల్స్, బస్సు ఎక్కే ప్రాంతాల్లో శిక్షకు సంబంధించిన పోస్టర్లు అతికించాలి.
- రాత్రి వేళల్లో సీనియర్ విద్యార్థులు జూనియర్ల వద్దకు వెళ్లకుండా ఉండేలా వార్డెన్లు అప్రమత్తంగా ఉండాలి.
- కొద్దిసేపు పొందే ఆనందానికి.. ఏదైనా తేడా వస్తే జీవితాంతం బాధపడేలా శిక్షలున్నాయన్న విషయం విద్యార్థులకు తెలియజెప్పాలి.
- కళాశాలల్లో సైకాలజిస్టులను నియమించుకుని విద్యార్థులకు కౌన్సెలింగ్ కార్యక్రమాలు నిర్వహించాలి.
- ప్రవేశాల సమయంలో విద్యార్థులకు ఇచ్చే ప్రాస్పెక్టస్‌లోనే ర్యాగింగ్‌కు పాల్పడరాదని సూచించాలి.
- ఫ్రెషర్స్‌డే వేడుకలు సైతం తరగతులు ప్రారంభించిన తొలి నెలలోనే పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలి.

1997 ర్యాగింగ్ యాక్ట్ ఏమి చెబుతోందంటే..

ఈ చట్టం ప్రకారం ర్యాగింగ్ అనాగరికమే కాదు.. నేరమని చెబుతోంది. ర్యాగింగ్ అనగా విద్యార్థికి అవమానం, బాధ, భయం, భీతి, దిగులు, జడుపు, దురుద్దేశ్యపూరితమైన పనులు, గాయాలకు కారణమైన లేదా కారణం కాబోయే చర్యగా పేర్కొన్నారు. దీని ప్రకారం ర్యాగింగ్‌పై చర్యలు తీసుకోని విద్యా సంస్థల యాజమాన్యాలు సైతం శిక్షకు అర్హులు. ర్యాగింగ్ చేస్తే విధించే జరిమానా, శిక్షలు దిగువన పట్టికలో వివరించబడ్డాయి.

ర్యాగింగ్ విధానం	విధించే శిక్ష
వేధించడం, అవమానించడం	6నెలల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా లేదా రెండూ
కొట్టడం లేదా బలవంతం చేయడం లేదా హెచ్చరించడం	ఏడాది జైలుశిక్ష, రూ.2వేల జరిమానా లేదా రెండూ
అక్రమ నిర్బంధం, బంధించడం, గాయపరచడం	రెండేళ్ల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా లేదా రెండూ
తీవ్రంగా గాయపరచడం, కిడ్నాప్ చేయడం, మానభంగం	ఐదేళ్ల జైలు శిక్ష, రూ.10వేల జరిమానా లేదా రెండూ
చంపుట లేదా ఆత్మహత్యకు ప్రేరేపించుట	పదేళ్ల జైలుశిక్ష, రూ.50వేల జరిమానా, లేదా రెండూ

విశ్వ విద్యాలయ వాతావరణం చాలా బాగుంది



యోగి వేమన విశ్వవిద్యాలయం క్యాంపస్ వాతావరణం చాలా బాగుంది. విద్యార్థులు అందరూ ఎంతో స్నేహపూర్వకంగా ఉన్నారు. ఎక్కడా ర్యాగింగ్ ఘటనలు మాకు కనిపించలేదు. అధికారులు ర్యాగింగ్ వలన కలిగే నష్టాలు, చట్టాల గురించి పోస్టర్ రూపంలో అవగాహన కల్పిస్తున్నారు.

- పి. కుసుమేశ్వరి, ఎంఎస్సీ ప్రథమ సంవత్సరం, వైవీయూ

ర్యాగింగ్ ఫ్రీ క్యాంపస్‌లా ఉంది..



యోగివేమన విశ్వవిద్యాలయం ర్యాగింగ్ ఫ్రీ క్యాంపస్‌గా ఉండటం మాలాంటి వారందరికీ ఎంతో సంతోషాన్నిస్తోంది. సీనియర్లు స్నేహపూర్వకంగా ఉంటున్నారు. అధికారులు ఎక్కడా ర్యాగింగ్ వంటి ఘటనలకు ఆస్కారం లేకుండా గట్టి చర్యలు తీసుకుంటున్నారు. వసతిగృహాల్లో సైతం ర్యాగింగ్‌పై అవగాహన కల్పిస్తున్నారు.

- సాయికుమార్, ఎంఏ హిస్టరీ అండ్ ఆర్కియాలజీ ప్రథమ సంవత్సరం, వైవీయూ

యాంటీ ర్యాగింగ్ పర్యవేక్షణ కమిటీల ఏర్పాటు



యోగి వేమన విశ్వవిద్యాలయం ర్యాగింగ్ రహిత విద్యాలయంలో గత కొద్ది సంవత్సరాలుగా ఉంది. సీనియర్లు, జూనియర్లు కలిసి సోదరుల్లా ఉంటున్నారు. ర్యాగింగ్‌కు పాల్పడటం ద్వారా కలిగే నష్టాలను తెలియజేసేలా ప్రచార కార్యక్రమాలు చేపట్టాం. యాంటీ ర్యాగింగ్ పర్యవేక్షణ కమిటీలను ఏర్పాటుచేసి పరిశీలించేలా చర్యలు చేపట్టాం.

- ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి, ప్రిన్సిపల్, వైవీయూ

జాతీయ సమైక్యత కోసం విరాళాల సేకరణ



విరాళాల సేకరణను ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్ డా. వి. సలీంబాషా, అధ్యాపకులు

వైవీయూ : మత సామరస్యాన్ని పెంపొందించడం, జాతీయ సమైక్యత కోసం ఎన్‌సీసీ కేడెట్స్ విరాళాలు సేకరించడం అభినందనీయమని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.వేమల సలీంబాషా పేర్కొన్నారు. కళాశాల ఎన్‌సీసీ యూనిట్ ఆధ్వర్యంలో నేషనల్ ఫౌండేషన్ ఫర్ కమ్యూనల్ హార్మోనీ(ఎన్ఎఫ్‌సీహెచ్) ప్రచార వారోత్సవంలో భాగంగా విరాళాల సేకరణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ మత సామరస్య ప్రచార వారంలో భాగంగా ఈ నెల 19వ తేదీ నుంచి 25వ తేదీ వరకు క్యాంపెయిన్ వీక్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎన్‌సీసీ అధికారి డా.స్వరూప మాట్లాడుతూ వివిధ రూపాల్లో హింసకు గురైన పిల్లల మానసిక, శారీరక మద్దతు కోసం నిధులను సేకరించి ఎన్ఎఫ్‌సీహెచ్ సంస్థకు పంపనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డా.సి.వి. కృష్ణవేణి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాంకేతికత వినియోగంతో ఉత్తమ పరిశోధనలు



వైవీయూ ఆచార్యులు డా.వి.రామకృష్ణను సత్కరిస్తున్న కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు

వైవీయూ: సాంకేతికత వినియోగంతో ఉత్తమ పరిశోధనలు అందుబాటులోకి వస్తాయని వైవీయూ సహ ఆచార్యులు డా.వి.రామకృష్ణ అన్నారు. డీబీటీ స్టార్ స్టేటస్‌లో భాగంగా కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో నిర్వహిస్తున్న కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం అందుబాటులోకి వచ్చిన బయోటెక్నాలజీ, బయోఇన్ఫర్మాటిక్స్ రంగాల్లో పరిశోధనలకు సాంకేతికత ఉపయోగపడుతుందన్నారు. డీబీటీ కోఆర్డినేటర్ డా. వై. సావిత్రి మాట్లాడుతూ పరిశోధనలు మానవుల సమస్యలకు పరిష్కారం చూపగలవన్నారు. జంతుశాస్త్ర విభాగాధిపతి డా.పి.రవిశేఖర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి అనుభవజ్ఞుల మార్గదర్శనంలో లక్ష్యసాధనకు కృషి చేయాలని సూచించారు. అనంతరం అతిథిని ప్రిన్సిపల్ డా.జి.రవీంద్రనాథ్, వైస్ ప్రిన్సిపల్ డా.ఎం. రమేష్ చేతుల మీదుగా ఘనంగా సత్కరించారు.పీ కార్యక్రమంలో అధ్యాపకులు నాగేంద్రకుమార్, మహేష్, అపర్ణ, కల్పన, విద్యార్థులు పాల్గొన్నారు.

శిశు గృహలో న్యాయ విజ్ఞాన సదస్సు



శిశుగృహలోని విద్యార్థుల సౌకర్యాలను తెలుసుకుంటున్న న్యాయమూర్తి బాబా ఫక్రుద్దీన్

కడప కోటిరెడ్డిసర్కిల్ : శిశువుల పట్ల జాగ్రత్తలు పాటించాలని, సకాలంలో టీకా వేయించాలని న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరి సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫక్రుద్దీన్ పేర్కొన్నారు. శిశు రక్షణ దినోత్సవం సందర్భంగా నగర పరిధిలోని కొండాయపల్లెలోని శిశుగృహంలో గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జడ్జి బాబా ఫక్రుద్దీన్ మాట్లాడుతూ జాతీయ న్యాయ సేవాధికార సంస్థ వారి బాలల సంరక్షణ కొరకు స్నేహ పూర్వక న్యాయ సేవల పథకం 2015, లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100 అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో శిశు గృహ మేనేజర్ కుమారి సిబ్బంది పాల్గొన్నారు.

మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రాల విడుదల



గోడ పత్రాలు విడుదల చేస్తున్న పింఛనర్ల సంఘం నాయకులు

కడప ఎడ్యుకేషన్ : స్వాతంత్రం కోసం మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలు వెలకట్టలేనివని జిల్లా పింఛనర్ల సంఘం ప్రధాన కార్యదర్శి రామ్మూర్తి నాయుడు పేర్కొన్నారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని ఆర్కే రాయల్ కరీం సేవా సమితి ఆధ్వర్యంలో ముద్రించిన ఆయన చిత్ర పటాలను కడప పింఛనర్ల సంఘం కార్యాలయంలో గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా రామ్మూర్తినాయుడు మాట్లాడుతూ తొలి విద్యాశాఖ మంత్రిగా ఆయన పనితీరును ప్రతి ఒక్కరూ గుర్తించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ రాయల్ కరీముల్లా, గౌస్ మోదిన్, దర్బార్ వలి, నారాయణ పాల్గొన్నారు.

రేషన్ సరుకులన్నీ పంపిణీ చేయాలి



రేషన్ పంపిణీ చేసే వాహనం ఆపరేటర్లను ప్రశ్నిస్తున్న లబ్ధిదారుడు

కమలాపురం : ప్రభుత్వం పౌరసరఫరాల శాఖ ద్వారా అందిస్తున్న రేషన్ సరుకులన్నీ లబ్ధిదారులందరికీ సక్రమంగా పంపిణీ చేయాలని లబ్ధిదారులు శివారెడ్డి తదితరులు కోరుతున్నారు. రేషన్ కార్డుదారులకు ప్రభుత్వం ఈనెల బియ్యంతో పాటు అర కిలో చక్కెర, కిలో కంది పప్పు, 1–3 కిలోల చొప్పున గోధుమలు పంపిణీ చేసేందుకు అన్ని రకాల సరుకులు డీలర్లకు సరఫరా చేసింది. అయితే ఎండీయూ వాహనాల ఆపరేటర్లు బియ్యంతో పాటు ఏదో ఒక సరుకు మాత్రమే ఇస్తున్నారని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. తనకు గోధుమలు కావాలని అడిగితే అయిపోయాయని, వాహనంలో లేవని ఆపరేటర్లు నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని లబ్ధిదారులు వాపోతున్నారు. లేక పోతే డీలర్ దగ్గర ఉన్నాయని, వెళ్లి తీసుకోవాలని ఆపరేటర్లు చెబుతున్నారని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బియ్యం ఒక చోట, గోధుమలు మరో చోట తీసుకోవాలా? అని ప్రశ్నిస్తున్నారు. రేషన్ సరుకుల పంపిణీపై రెవెన్యూ అధికారులు తనిఖీలు నిర్వహించాలని, రెవెన్యూ అధికారుల తనిఖీలు లేక పోవడంతోనే ఎండీయూ వాహనాల ఆపరేటర్లు నిర్లక్ష్యంగా సరుకులు పంపిణీ చేస్తున్నారని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

10న నగరవనానికి బస్సు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగర శివారులోని నగరవనంకు ఈ నెల 10వ తేదీన ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించనున్నట్లు కడప డిపో మేనేజర్ డిల్లీశ్వర్‌రావు ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 8.00, 9.00 గంటలకు ఈ బస్సు శిల్పా రామం, పాలకొండల మీదుగా నగర వనం చేరుతుందన్నారు. అలాగే తిరుగు ప్రయాణంలో సాయంత్రం 5.00, 6.00 గంటలకు బస్సు ఉంటుందన్నారు. టిక్కెట్ రూ.20 చొప్పున నిర్ణయించామన్నారు. నగర వాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

17న సాహిత్య పురస్కార సభ

కడప కల్చరల్ : కవిత విద్య సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 15న సాహిత్య పురస్కార సభ నిర్వహిస్తున్నామని సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు అలపర్తి పిచ్చయ్యచౌదరి ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటలకు స్థానిక సీపీ బ్రౌన్ గ్రంథాలయంలో ఈ సభ నిర్వహిస్తామన్నారు. ఇందులో సీనియర్ కథా రచయిత ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి స్మారక జీవిత సాఫల్య పురస్కారాన్ని ప్రముఖ కథ, నవల రచయిత సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డికి అందజేయనున్నామన్నారు.

చోరీ కేసులో మహిళ అరెస్టు

కడప అర్బన్: చోరీ కేసులో ఓ మహిళను అరెస్టు చేసినట్లు తాలుకా సీఐ వేంకటేశ్వర్లు తెలిపారు. సీఐ వివరాల మేరకు... నగరంలోని నబీకోటకు చెందిన దేవి ఇంట్లో చొరబడిన నిందితురాలు కవిత బీరువాలో రూ.1.20 లక్షల నగదు చోరీచేసినట్లు తెలిపారు. బాధితురాలి ఫిర్యాదుతో విచారించిన పోలీసులు కవితను అరెస్టు చేసి ఆమె వద్ద రూ.50 వేలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

11న కలెక్టరేట్ వద్ద ధర్నా

కమలాపురం : భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఈనెల 11వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాకు తరలి రావాలని భవన నిర్మాణ కార్మికుల సంఘం జిల్లా యూనియన్ నాయకుడు బల్లారపు రామాంజనేయులు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక పెద్దదర్గా వద్ద జరిగిన భవన నిర్మాణ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇసుక, నిర్మాణ రంగంలో ముడి సరుకుల అధిక ధరలను నియంత్రించాలన్నారు. ఓబయ్య, అశోక్, నివాస్, వెంకట సుబ్బమ్మ, మొన్నయ్య, మెనెమ్మ, శిరీష, వాసు, బంగారయ్య పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ జావీద్

కడప ఎడ్యుకేషన్ : ట్రాఫిక్ నిబంధలను ప్రతి ఒక్కరూ పాటించి ప్రమాదాలను నియంత్రించాలని కడప ట్రాఫిక్ సీఐ జావిద్ పేర్కొన్నారు. ట్రాఫిక్ అవేర్‌నెస్ అండ్ రోడ్డు సేఫ్టీ కార్యక్రమంలో భాగంగా కడప నగరంలోని బీరం జూనియర్ కళాశాల విద్యార్థులకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా మంది యువకులు టూవీలర్‌ను అత్యంత వేగంగా నడుపుతూ ప్రమాదాలను కొని తెచ్చుకుంటున్నారన్నారు. తల్లిదండ్రులు యువతకు టూవీలర్స్ ఇవ్వకూడదని సూచించారు. విద్యార్థులు నడుపుతున్నప్పుడు ఖచ్చితంగా హెల్మెట్ వాడుతూ నిబంధనలను పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్, విద్యార్థులు పాల్గొన్నారు.

గండికోట అభివృద్ధికి కృషి చేయాలని వినతి



డాక్టర్ గోపినాథ్ జెనతో చర్చిస్తున్న డాక్టర్ జాస్తి వీరాంజనేయులు

కడప కల్చరల్ : పర్యాటక ప్రాంతం గండికోట అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని అఖిల భారత పంచాయతీ పరిషత్ న్యూ ఢిల్లీ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు కోరారు. విజయవాడ సమీపంలోని సంస్థ కార్యాలయంలో కేంద్ర పురావస్తు శాఖ అమరావతి సర్కిల్ సూపరింటెండెంట్, ఆర్కియాలజిస్టు డాక్టర్ గోపినాథ్ జెనను కలిసి గురువారం వినతిపత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ ఆర్కియాలజీ పరంగా ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలని కోరారు. రాష్ట్రంలోని చారిత్రక ప్రదేశాలను పరిరక్షించి విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. కడపజిల్లాలో బౌద్ధ జైన ఆనవాళ్లు ఉన్నాయని, అడపూరు బౌద్ధారామాలను రక్షించాలని కోరారు.

పనిచేసే చోటే ఉద్యోగులు నివాసముండాలి



డీఆర్‌ఓకు వినతి పత్రాన్ని సమర్పిస్తున్న ఆర్ఎస్ఓ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : ప్రభుత్వ ఉద్యోగులంతా తాము పనిచేసే చోటే నివాసముండాలని రాయలసీమ స్టూడెంట్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జగన్ డిమాండ్ చేశారు. ఈ విషయమై ఇన్‌ఛార్జి డీఆర్‌ఓను కలెక్టర్ కార్యాలయంలో ఆయన కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా చాలా మంది ఉద్యోగులు తాము పనిచేసే చోటు నుంచి 30 నుంచి 50 కిలో మీటర్ల దూరంలో నివాసాలుంటున్నారని తెలిపారు. చాలా మంది దూర ప్రాంతాల నుంచి విధులకు రావాల్సి ఉండడంతో సమయపాలన పాటించడంలేదని ఆరోపించారు. ఉన్నతాధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఓ నాయకులు వంశీ పాల్గొన్నారు.

గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలను వాయిదా వేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : నిరుద్యోగులు ఎదురు చూస్తున్న గ్రూప్- 2 మెయిన్స్ పరీక్షల షెడ్యూల్‌ను మరో రెండు నెలల పాటు వాయిదా వేయాలని డీవైఎఫ్ఐ నగర కన్వీనర్ విజయ్ కోరారు. సీపీఎం కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ 2024 ఫిబ్రవరి, 25న ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహించి, ఏప్రిల్ 10న ఫలితాలు ప్రకటించారన్నారు. మెయిన్స్‌కు 1:100 ప్రకారం తీసుకొని జూలై 28 పరీక్షలు నిర్వహించాల్సి ఉండగా, అప్పటి ఏపీపీఎస్సీ చైర్మన్ లేకపోవడంతో వాయిదా వేస్తూ వచ్చారని తెలిపారు. ఇప్పుడు ఉన్న పలంగా జనవరి 5వ తేదీ నుంచి మెయిన్స్ పరీక్షలు నిర్వహిస్తామని ఏపీపీఎస్సీ ప్రకటించడంతో గ్రామీణ అభ్యర్థులకు తీవ్ర నష్టం జరుగుతుందని తెలిపారు. సిలబస్ దృష్టిలో ఉంచుకొని కనీసం 90 నుంచి 120 రోజులు గడువు ఇవ్వాలని కోరారు. డిసెంబర్ చివరి వారంలో పోలీస్ కానిస్టేబుల్ ఈవెంట్స్, రైల్వే పరీక్షలు వంటివి ఉండటంతో వాటికే సమయం సరిపోదన్నారు. ఏపీపీఎస్సీ ప్రకటించిన పరీక్షల గడువును రీ షెడ్యూల్ చేయాలని కోరుతున్నామని తెలిపారు. ఈ సమావేశంలో ఉదయ్ పాల్గొన్నారు.

యువతి ఆత్మహత్యాయత్నం

కడప అర్బన్: కడవ నగరం నాగరాజుపేటలోని మల్టీ స్పెషాల్టీ ఆసుపత్రిలో పని చేస్తున్న యువతి గురువారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఆసుపత్రిలో నర్సుగా పని చేస్తున్న యువతి అక్కడే ఓ యువకుడిని ప్రేమించింది. ఇరువురి మధ్య ఏం జరిగిందో కానీ యువతి ఆత్మహత్యయత్నానికి పాల్పడిందని స్థానికులు తెలిపారు. చికిత్స నిమిత్తం ఆమెను ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం వేలూరుకు తరలించినట్లు తెలుస్తోంది. మృతి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

చీటీల మోసం కేసులో జైలు శిక్ష

కడప అర్బన్: చీటీలు వేసి మోసం చేసినందుకు పలువురికీ జైలు శిక్ష విధిస్తూ ప్రిన్సిపాల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి తీర్పు చెప్పారు. పోలీసుల వివరాల మేరకు.. కడప నగరం రాజారెడ్డి వీధికి చెందిన రెడ్డి నాగులు, అతడి భార్య లక్ష్మీదేవి చాలాకాలంగా ప్రజలతో చీటీలు వేయిస్తున్నారు. అవి పూర్తయిన తర్వాత వారికి డబ్బులు ఇవ్వకుండా కాలయాపన చేస్తూ మోసగించేవారు. ఈ క్రమంలో బాధితుల ఫిర్యాదు మేరకు రెడ్డి నాగులు, లక్ష్మీదేవి, పాలెం శారద, వెంకట సుబ్బరాయుడు, రెడ్డిశేఖర్‌లపై పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణలో నిజాలు తేలడంతో వారికి నాలుగేళ్ల జైలు శిక్ష, రూ.22 వేల జరిమాన విధిస్తూ ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి తీర్పునిచ్చారు.

మరో చీటింగ్ కేసులో..

ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా చిట్స్ పేరుతో 33 మంది వ్యక్తులను మోసం చేసిన కేసులో భార్యాభర్తలైన పల్లె మల్లికార్జునరెడ్డి, హరి తమ్ములకు ఏడు సంవత్సరాల జైలు శిక్ష, రూ. 22వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.